



కొన్ని రోజుల తర్వాత పై అధికారులు కొందరు వచ్చి మెస్ మానేజ్‌మెంట్ స్టూడెంట్స్ కివ్వమని వార్డెన్‌కి చెప్పి - ఇదివరకటి మెస్  బిల్స్ సబ్మిట్ చేయాలనీ

రెండ్రోజుల్లో చెకింగ్ జరుగుతుందనీ చెప్పారు.

వార్డెన్ గుండెల్లో రాయి పడింది! ఒక్క బిల్లూ తన దగ్గర లేదు. ఎప్పటికప్పుడు ఏవో దొంగ బిల్లులు తయారుచేసేది.

తన అవసరార్థం కొన్న వస్తువుల బిల్లులు కూడా అందులో జతచేసేది. అందులో సగానికి పైగా తన దగ్గర లేనేలేవు.

ఇప్పుడెలా? బాగా ఆలోచించింది. తీవ్రంగా ఆలోచించింది. తన డబులెమ్మే, పీహెచ్డీ పాండిత్యాన్నంతా ఉపయోగించి ఆలోచించింది. అంతే ! మెరుపులాంటి ఆలోచనేదో తట్టింది.

జయ అంటే పడని పార్టీ ఒకటి ఆ హాస్టల్లో వుంది. ఆ పార్టీలో దాదాపు అయిదుగురు పిల్లలున్నారు. వాళ్ళని ఆ రాత్రి తన రూంకి పిలిపించుకుంది. ఏమిటేమిటో చెప్పింది. వాళ్ళు బసవన్నల్లా తలలూపారు. అంతే, తలుపులు వేసుకున్నారు. అర్థరాత్రి పన్నెండు దాటాకే ఆ మూసిన తలుపులు తెరుచుకోవటం జయ గమనించింది.

అయితే జయావాళ్ళు వూరికే కూర్చోలేదు ! వార్డెన్ జరుపుతోన్న - మంతనాలేమిటో తెలుసుకుందామని విశ్వ ప్రయత్నం చేసి విఫలులయ్యారు.

ఆ మర్నాడు ఉదయం జయ అపొజిషన్ పార్టీ లీడర్ పరుగెత్తుకుని వచ్చింది.... జయ రూం కి !

"జయా! రాత్రంతా వార్డెన్ మాతో దొంగ బిల్లులు తయారు చేయించింది. మేం చెయ్యమండీ అంటే వింటేనా? పరీక్షల్లో మీ అంతు చూస్తానంటూ ఒకటే బెదిరించింది."

" ఆ బెదిరింపులకు ఝడిసి మీరు లొంగి పోయారన్నమాట."

"నువ్వు ఇప్పుడేమన్నా పడ్తాను జయా! కాని ఈ ఒక్క మాట విన్పించుకో! అకస్మాత్తుగా మమ్మల్ని అడిగి ఇరుకునబెట్టి రాయించుకుంది తప్ప, అది ఏమాత్రం మేం ఊహించినా - నీ సలహా తీసుకునేవాళ్ళం ! దొంగ బిల్లులన్నీ తనే రాసి - మా బొటన వేళ్ళతో ముద్ర వేయించుకుంది ! కుడిచేతి వేళ్ళతో కొన్నీ - ఎడంచేతి వేళ్ళతో మరికొన్నీ- ఇలా మా ఆర్గురి ముద్రలూ వేయించుకుంది ! ఆ పని చేయం అంటే - ఏమి చేస్తుందో నన్న భయంతో - ఆమె చెప్పినట్టల్లా చేశామేగానీ - ఆతర్వాత మాకెవరికీ నిద్ర పట్టలేదు! తెల్ల కాగితాలాన్నింటినీ నలిపి నలిపి - మట్టిలో రుద్ది- అవి పాత కాగితాల్లా తయారుచేసి - మా చేత దొంగ బిల్లులు సృష్టించింది!" అంది చంద్ర భయపడ్తూ.

"సరే ! ఈ సంగతి ఆ అధికారుల చెవిని పడేస్తే సరి ! నువ్వేం భయపడనక్కర్లేదు. నేను నీ నెత్తి మీదికి తీసుకొని రాను ! నువ్వీ విషయం చెప్పినందుకు - మెనీమెనీ థ్యాంక్స్!" అంది జయ.

"చూశావా నిమ్మీ - మన లీలాసుందరి లీలలు!" అంది జయ.

ఆ మర్నాడు అధికారులు వచ్చి, అసలు విషయాన్ని పసిగట్టి, వార్డెన్‌గా ఆవిడని వూస్ట్ చేశారు. శాపనార్థాలు పెడ్తూ సామాన్లు సర్దుకోసాగింది ఆవిడ !

వెళ్ళేదాన్ని శాంతంగా వెళ్ళనీకుండా - జయ వెళ్ళి: "మీరు వెళ్ళిపోతున్నారటగా మేడం! ఎప్పుడు వెళ్తున్నారు?" అడిగింది.

"మీకెందుకమ్మా... ఎప్పుడు వెళ్తే...?" అంది ఆవిడ సాధ్యమైనంత శాంతంగా.

" మీరెప్పుడు వెళ్తున్నారో తెలిస్తే - మీకు ఫేర్వెల్ పార్టీ ఇద్దామనుకుంటున్నారు స్టూడెంట్స్!" అంటూ ఎంతో వినయంగా మాట్లాడుతోన్న జయని చూస్తూంటే - ఆ సంభాషణ విందామని అక్కడికి వచ్చిన స్టూడెంట్స్‌కి నవ్వాగింది కాదు!

"ఉన్నన్ని రోజులూ మీరు చూపించిన ప్రేమానురాగాలు నేను ఏ జన్మకీ మరిచి పోలేను... ఇంకా పార్టీ ఎందుకమ్మా?" అన్నారు కళ్ళు తుడుచుకుంటూ

'పాపం !' అనిపించింది జయకి.

ఆ నెల అరుణా జయా కలిసి మెస్ రన్ చేశారు. మెస్ బిల్ ముప్పైరూపాయలు వచ్చింది.

"వాటెవండర్! డెడ్‌ఛీప్! వుయ్ కాంట్ బిలీవిట్!" అన్నారు హాస్టలర్సందరూ.

"నమ్మకపోతే మరో అయిదు ఎక్కువే ఇవ్వండి- పోయిందేముంది? ఇంత తక్కువ మెస్ బిల్ చేసినందుకు ప్రతిఫలం అనుకుంటాం!" అంది అరుణ నవ్వుతూ.

"ఎస్టాబ్లిష్‌మెంట్ ట్వంటీ ప్లస్ మెస్ బిల్ థర్టీ ఈజీక్వల్టు ఫిఫ్టీ ! హాయ్..... హాయ్....... ఈ నెల ఓ యాభై రూపాయలు మిగులు మన బడ్జెట్లో!" అనుకుని అందరూ కలిసి సంతోషంగా ఓ పార్టీ చేసుకున్నారు.

అయితే రెండేళ్ళుగా వార్డెన్ తిన్న సొమ్ము ఎంతో లెక్కవేసి చూస్తే - అది పది వేల పైనే అని తేలింది.

ఈ కరువు రోజుల్లో మెస్ బిల్ ముప్పైయి రూపాయలంటే - రోజుకొక్క రూపాయి తిండిఖర్చనీ - అంత పొదుపుగా ఖర్చుపెట్టి అంత తక్కువ మెస్ బిల్ చేసినందుకు పై అధికారులు కూడా అరుణనీ, జయనీ ప్రశంసించారు!

" ఇప్పుడున్న లెక్చరర్స్‌లో మీకెవరు వార్డెన్‌గా కావాలో చెప్పండి!" అడిగారు.
"భారతి మేడం ! వుయ్ వాంట్ భారతి మేడం!" అరిచారు పిల్లలందరూ.

" మీరంతా ఆమెనే కావాలంటున్నారంటే అమెకూ, మీకూ మధ్య ఏదైనా వ్యవహారం వుందేమిటీ?" పళ్ళికిలించాడు ఓ గారపళ్ళ పెద్దమనిషి.

"మీరు అడిగిన తర్వాతే మీకావిడ పేరు సజెస్ట్ చేశాంగానీ, మా అంతట మేమొచ్చి మాకు ఆవిడే కావాలని అడగలేదు! మీరు ఆవిడని పంపించకున్నా ఫర్వాలేదు! కానీ ఆవిడ గురించి అలా తేలిగ్గా మాట్లాడ్తే సహించలేం ! నిజానికీ సంగతి ఆవిడకి తెలీదు కూడా ! మీ మనసుకు తోచిన మాటలు మాట్లాడ్డం - అంత ఆరోగ్యప్రదం కాదేమో..!" అంది నిర్మల సీరియస్‌గా.

నవ్వుతూన్న గారపళ్ళ పెద్దమనిషి ముఖం చిన్నబోయింది.

ఆ సాయంత్రమే వాళ్ళకిష్టమైన భారతి మేడం హాస్టల్‌కి వార్డెన్‌గా వచ్చేశారు. ఆ మేడం అంటే వాళ్ళకెంత యిష్టమో - అంత భయం కూడా.

ఆ రోజు కొత్త వార్డెన్ పిల్లలందర్నీ సమావేశపరిచారు. మెస్‌కీ, స్టడీ అవర్స్‌కీ, హెల్త్‌కీ, క్లెన్లీనెస్‌కీ.... అలా ఒక్కో పనికి ఒక్కో ఇన్‌చార్జిని పెట్టారు !

రాత్రి ఎనిమిది నుంచి పది గంటలదాకా, మళ్ళీ ఉదయం అయిదు నుంచి ఏడు గంటల దాకా స్టడీ అవర్స్ ! ఆ స్టడీ అవర్స్‌లో ఎంజాయ్ చేయడానికిగానీ కబుర్లు చెప్పుకోవడానికి గానీ వీల్లేకుండా - మధ్య మధ్య వార్డెన్ ఒకటి రెండు సార్లు చెకింగ్‌కి వస్తారు. నెలకి ఒకసారి సినిమాకీ, రెండుసార్లు షాపింగ్‌కీ ఒకసారి యింటికి వెళ్ళడానికీ పర్మిషనిచ్చారు.



ఆఫ్‌కోర్స్, సినిమా పిచ్చి వున్నవాళ్ళకు తప్ప అందరికీ ఆ రూల్సన్నీ నచ్చాయి! స్టడీ అవర్స్‌లో తప్ప, మిగతా సమయంలో ఎంత అల్లరిచేసినా ఏమీ అనకపోయేవారు వార్డెన్.

"ఇదివరకటి లీలా సుందరి మేడమ్ అయితే ఒక రూంలో వున్నవాళ్ళని ఇంకో రూంకి వెళ్ళనిచ్చేది కాదు.. అందరూ కలిస్తే తమకేం ముప్పు వస్తుందో అన్న భయంతో 144 సెక్షన్‌లా చెక్ చేసేదనుకో!" చెప్పింది రజిత

"అసలు ఆ మనిషి తరహాయే అదోరకం! మేము పీయూసీలో వున్నప్పుడు పరీక్షలయ్యాక లాస్ట్‌డే బాగా ఎంజాయ్ చేసి ఇంటికి వెళ్దామనుకున్నాం ! కానీ-తను అదే రోజు సాయంత్రం వెళ్తోంది కాబట్టి - మమ్మల్నీ అదే రోజు వెళ్ళమని ఒకటే గొడవపెట్టి - ఆఖరుకు మేం వెళ్ళి పోయేదాకా ఊర్కోనేలేదు!" అంది జయ.

"ఎందుకలా ఫోర్స్ చేసింది?"

"వార్డెన్ లేకుండా పిల్లలు హాస్టల్లో వుంటే - ఏవైనా గొడవలు జరిగితే బాధ్యులెవరని అడిగింది."

" మరి వారానికి మూడు రోజులు లీవు తీసుకొనేదన్నారుగా - ఆ మూడు రోజులూ మిమ్మల్ని వదిలిపెట్టి ఎక్కడికీ వెళ్ళేదికాదా?"

" ఎందుకు వెళ్ళకపోయేది ? ఎంచక్కా మొగుడిదగ్గరకు వెళ్ళేది ! అప్పుడు తన ఫ్రెండ్ యింకో మేడంని ఇన్‌చార్జ్ చేసేది!"

"మరి ఆ ఇన్‌చార్జ్ మేడం హాస్టల్లో వుండేవారా ?"

"ఊహుం"

"మరి అప్పుడు ఏవైనా గొడవలు జరిగితే - ఎవరు బాధ్యులట?"

“అందుకే ఒకసారి అదను చూసి ప్రతీకారం తీర్చుకున్నాం !”

“ఎలా”?

“ఇంకోసారి తను లేనిది చూసి - హాస్టల్లో ఏవో వస్తువులు పోయాయి - ఎవరో గోడ దూకి వచ్చారనీ వుత్తినే పుకారు పుట్టించాం. అది పై అధికారుల దాకా వెళ్ళింది. వాళ్ళు ఈమెకు మెమో పంపారు !”

“మొత్తానికి భలే పాలిటిక్స్ ఆడారన్నమాట”? అంది నిర్మల నవ్వుతూ.

“ ఆవిడ కొట్టిన ప్రతి దెబ్బకూ ఎలాగైతేనేం తిరిగి కోలుకోలేనంత ఇదిగా ఎదురు దెబ్బ తీయగలిగాం!” అంది అరుణ.

❋❋❋❋❋❋

స్టూడెంట్స్ యూనియన్ మెంబర్స్‌గా ఎవరెవరు కంటెస్ట్ చేస్తారో పేర్లివ్వమని ప్రిన్సిపాల్ గారు నోటీస్ పంపించారు. ఇక పిల్లల్లో గొడవమొదలైంది. ప్రెసిడెంట్ గా చంద్రని నిలబెడ్దామని కొందరూ, కాదు జయని నిలబెడ్దామని మరి కొందరూ పోట్లాడుకోసాగారు.

“ చంద్ర - కాలేజీఫస్ట్ కాబట్టి, తనే ప్రెసిడెంట్ కావాలి!”.

“కాదు - జయే కాలేజీ ఫస్ట్!”,

“ మా చంద్ర డ్రామాల్లో ఎంత అద్భుతంగా నటిస్తుందో తెలుసా”?

“బోడి, మీ చంద్ర డ్రామాల్లో యాక్ట్ చేస్తుందేమోగానీ, మా జయ అయితే డ్రామాలనే రాస్తుంది!”

“ మా చంద్ర ఎర్రగా వుంటుంది.”

“ ఏం లాభం ? కొయ్యలా వుంటుంది ! మా జయది చూడూ, ఎంత చక్కటి ఫ్టక్చరో?”

అక్కడి నుంచి వెళ్తోన్న ఇంగ్లీష్ లెక్చరర్ వీళ్ళ సంభాషణ విని: “వాళ్ళేదో కంటెస్ట్ చేస్తుంటే మధ్య మీరెందుకమ్మా పోట్లాడ్తారు? వీలైతే మీరు మీమీ కాండిడేట్స్ గెలిచేలా చూసుకోండి” అన్నారు నవ్వుతూ.

ఆరోజే పోలింగ్ !

రజిత పరుగెత్తుకొని వచ్చి చెప్పింది జయకి.

“లీలా సుందరి మేడం నీకు ఓట్లెయ్యొద్దని చెప్పారట తన కన్సర్న్డ్ స్టూడెంట్స్‌తో.”

“ అలాగా !”

“ ఇప్పటి వరకూ గెలుపు నీదే అనుకున్నాం! కాని చివరి క్షణాల్లో పరిస్థితులు తారుమారయ్యేలా వున్నాయి! ఎవరికి వేస్తారు మీ ఓటు అని పిల్లల్ని అడిగితే ఎవరికో ఒకరికి వేస్తాంలే అంటున్నారు! మొత్తానికి లీలాసుందరి వీళ్ళని బెదిరించి - నిన్ను గెలవనీకుండా తన పగ తీర్చుకునేలా కన్పిస్తోంది.”

“లెటిట్‌బీ ! జరిగేదేదో జరుగుతుంది.ఈ కంగారెందుకు చెప్పు?”

"అది కాదే... నువ్వా చంద్ర చేతిలో ఓడిపోవడమన్నది వూహించడానిక్కూడా మాకు అదోలా వుందే ! ప్రత్యక్షంగా ఎదురైతే ..."

" ఆవేశపడకు రజితా ! ఎవరు గెలిస్తేనేం ? చంద్ర గెలిచినా నష్టమేమీలేదు. తను కూడా డిజర్వ్‌డ్ క్యాండిడేట్!" అంది జయ నిదానంగా

కౌంటింగ్ ప్రారంభమైంది.

చెట్టు కింద నించున్న జయని పిలిచింది లీలా సుందరి.

" జయా! నువ్వే లీడింగ్‌లో వున్నావట ! రేపు రాఖీ పండుగకదా! ప్రిన్సిపాల్‌గారు సెలవు ఇవ్వనంటున్నారు! నువ్వు ప్రెసిడెంట్‌గా ఎన్నికైతే సెలవు ఇప్పించు." అడిగింది.

"చూస్తానండీ" అంటూ వచ్చేసింది జయ.

"ఏమడిగిందీ ?" చుట్టు ముట్టారు నేస్తాలు.

చెప్పింది జయ.

"ఓహో సెలవు దొరికితే మొగుడి దగ్గరకు చెక్కేయాలని కాబోలు ! వీల్లేదే జయా! నువ్వసలు అడగనే అడగకు - తిక్క కుదుర్తుంది. లేక పోతే ఇందాకటిదాకా నీకు ఓట్లయ్యొద్దని చెప్పి, ఇప్పుడు కాకాలు పట్టడానికి వచ్చిందా?" అంది రజిత ఆవేశంగా.

మరో మూడు గంటల తర్వాత ఫలితాలు తెలిసాయి. మొత్తం పోలింగైన ఆరొందల ఓట్లలో అయిదొందల అరవై ఓట్లు జయకి రాగా, చంద్రకి కేవలం నలభై ఓట్లు వచ్చాయి. ఇక పిల్లల అనందం చూడాలి. పట్టపగ్గాలే లేవు.

ఆ సాయంత్రం హాస్టలర్సందరికీ పార్టీ ఇచ్చింది జయ.

" అసలు నీకు అన్ని ఓట్లు రావడం ఏమిటీ? చంద్రకు పాపం డిపాజిట్ కూడా దక్కనట్టుంది. చంద్రక్కూడా కాలేజీలో బాగానే ఇన్‌ఫ్లుయన్స్ వుందిగా, తనకంత తక్కువ ఓట్లు రావడమేమిటి?" ఆశ్చర్యంగా అడిగింది అరుణ.

" దీన్లో ఆశ్చర్యపడాల్సిందేముందే! జయా, చంద్రా తెలివితేటల్లో, చదువులో సమానులే కావొచ్చు ! కాని జయలో వున్న ధైర్యం, చురుకుదనం, ఆకర్షణ చంద్రలో అగుపించవు! దేనికీ చలించని మనస్తత్వం జయది! ఏదైనా సాధించాలనుకోవాలేగానీ- ఏ అడ్డంకుల్నీ లెక్క చేయదు! చంద్రలో ఆ ధైర్యం లేదు! ఏ లెక్చరర్ బెదిరించినా గజగజా వణుకుతుంది! మోరోవర్ - వ్యక్తిగతంగా కూడా చాలా మంది జయనే యిష్టపడ్తారు!" అంది రజిత

"ఆహాఁ" అంది జయ వెక్కరింతగా

"ఏయ్! ఏమిటా ఎగతాళి? నేను చెప్తోంది అతిశయోక్తి ఏం కాదులే ! అసలు నువ్వు నడుస్తున్నా, కూర్చున్నా ఎవరితోనైనా మాట్లాడుతున్నా - కాలేజీలో కొన్ని జతల కళ్ళు నిన్ను పరికిస్తూనే వుంటాయి తెలుసా?"

"ఐసీ... " తన మామూలు హాస్య ధోరణిలో అంది జయ.

"నిజం జయా! అసలు నీతో మాట్లాడ్తే చాలు జన్మ ధన్యమైనట్లుగా భావించే అమ్మాయిలున్నారు మన కాలేజీలో! ఆడవాళ్ళనే ఇంత ఆకర్షిస్తున్నావంటే - కో-ఎజుకేషన్ కాలేజీలో చేరి వుంటే - మగాళ్ళు మతులు పోగొట్టుకుని ..."

"ఊఁ.. ఆగిపోయావేం? చెప్పు !నవ్వన్లే !"

"ఛీ- పోవే ! నీకెప్పుడూ నవ్వులాటే ! సాటి ఆడదాన్నై వుండికూడా ఏ మాత్రం ఈర్ష్య పడకుండా - విశాల హృదయంతో నిన్ను పొగిడితే - 'ఊ, అహఁ, అలా.. ఆ తర్వాత' అంటూ ఎగతాళి చేస్తావా?" బుంగమూతి పెట్టుకుని అలిగింది రజిత.

" అదా ఎత్తు !? నువ్వెలాగూ బుంగమూతిలో ముద్దొచ్చేలా వుంటావని... వూరిస్తున్నావ్ కదూ...!?"

"పో... నీ ముద్దు ఎవడిగ్గావాలి...?"

"ఎవడికో అయితే నేనెందుకిస్తాను, నీకైతేనే - రెడీ"

"నాకేం అక్కర్లా!"

"ఓ యబ్బో, లోపలంతా ముద్దుపెడ్తే వుబ్బిపోవాలనే ఉందిగానీ....

" బోడి. నువ్వే వున్నావా?"

" ఇంకెవరైనా వున్నారేమిటీ, నాకు తెలీకుండా!? - ఎవరికీ చెప్పనుగానీ ఆ అదృష్టవంతుడెవరో చెప్పూ" రహస్యం అడుగుతున్నట్టుగా అడిగింది జయ.

"తల్లీ - నీకో దణ్ణం - నీ ముద్దుకో దణ్ణం! నన్నేడ్పించకు - నీకు పుణ్యం ఉంటుంది" జయతో ఇక మాటల్లో గెలువలేను అనుకున్నప్పుడల్లా నమస్కార బాణాన్ని ప్రయోగిస్తుంది రజిత.

"అహ్హాహ్హా! నేనంటే - మరేమనుకున్నావ్?" అని కనుబొమ్మలు మెలేసింది జయ గర్వంగా.

"కనుబొమ్మలు మెలేయడం దేనికీ?" అడిగింది నిర్మల ఆశ్చర్యపోతూ

"మీసాల్లేవుగా - మరి తిప్పుకోవడానికీ ఇలా గెలిచినప్పుడల్లా మీసాలకి బదులు కనుబొమ్మలు తిప్పుకోవడం ఆమెకో అలవాటు." అంది రజిత మూతి మూడు వంకర్లు తిప్పుతూ

ఫక్కుమంది నిర్మల..

" జయా! నాకు మా రూంలో వుండబుద్ధి కావడంలేదే!" గారాలుపోతూ వచ్చింది రజిత.

" ఉండకు !"

" మరెక్కడ వుండమంటావ్ ?"

"కారిడార్ వుందిగా!"

"ఎంత అన్యాయంగా మాట్లాడ్తున్నావే!"

" మరేం చెప్పమంటావే !"

" అది కాదే . అసలు స్టడీ అవర్స్‌లో కూడా చదువు బుర్రకెక్కడం లేదంటే నమ్ము."

" ఇదేమిటీ - కొత్త జబ్బు ?"

"నిజంగానే చిట్టితల్లీ ! దానికితోడు నా రూమ్మేట్, ఆ కొత్త పిల్ల వుందిచూడూ ముంగిలావుంటుంది. ఎంతకీ మాట్లాడదు!"

"పోనీ నువ్వే మాట్లాడించి చూడరాదూ ?"

" ఎంత ప్రయత్నించినా పొడి పొడి గానే మాట్లాడ్తుంది. అసలు ఎవరితోనూ మాట్లాడకుండా, ఎవర్తోనూ స్నేహం చేయకుండా కొంతమంది అలా ఎలా వుండగల్గుతారో నాకర్థంకాదే."

" అందరూ నీలా నాలా వాగుడు పిట్టలే అయితే ఇక బాగుపడ్డట్టే!"

" మాట్లాడకపోతే పోనీ - నేనా రూమ్‌లో యింకెవర్తో కలిసి అల్లరి చేసినా అసహనంగా చూస్తుంది ! ఆ రూమేదో తన అబ్బ సొత్తయినట్టుగా వ్యవహరిస్తుంది! ఆ రూంలో క్షణం వుండబుద్ధి కాదనుకో. అసలు ఆ పిల్ల తత్వమే వేరు జయా., మనమేదన్నా కారప్పూసా, చేగోడీలూ ఇంటినుంచి తెస్తే - అందరికీ ఇస్తాం కదా! ఆవిడ ఎవరికీ ఇవ్వదు! మన ఎదురుగానే - మనకి ఇవ్వకుండానే తింటుంది! ఆ పిల్లకి అది ఎలా వుంటుందో కానీ చూడడానికి నేనే డెలికేట్‌గా ఫీలవుతాను!"

" ఇవ్వకపోతే పోనీ - వాటికి మనమేమైనా ముఖం వాచి ఉన్నామా? ఇలాంటి వాటిని పట్టించుకుని బాధపడటమెందుకూ ? చూసీ చూడనట్టు వూరుకుంటే పోలా!?"

"ఊరుకోక ఏం చేస్తున్నాం మరి ? అసలు నాకింకొకటి మరీ చిత్రంగా అన్పిస్తుంది! అలాంటివేవైనా ఇంటినుంచి తెచ్చినపుడు - నేను తింటూ తనక్కాస్త పెట్టినప్పుడు- నిస్సంకోచంగా ఎలా తింటుందా అనీ"

" అలాగా ! ఆ విషయం ఇందాకణ్ణుంచీ చెప్పవేం? నువ్వు నిశ్చింతగావుండు రాజీ ! నేనా పిల్ల పని పడ్తాను!" అరుణ అభయహస్తమిచ్చింది.

ఆ సాయంత్రం ఆ పిల్ల బజారుకు వెళ్ళడం గమనించి, అమె కబర్డ్ తాళం తీసి, ఆమె దాచుకున్న చేగోడీలన్నీ తీసుకుని, తలా ఒకటిచ్చింది అరుణ. దొరికినవన్నీ తినగలిగినంతా గప్‌చుప్‌గా తినేసి, ఎప్పట్లా తాళం వేసి, ఏమీ ఎరుగని వాళ్ళకిమల్లే కబుర్లతో మునిగిపోయారు.

చీకటి పడబోతూందనగా హాస్టల్‌కి వచ్చిన ఆ అమ్మాయికి తన కబర్డ్ లో ఒక్క చేగోడీ లేక పోవడం గమనించి - నివ్వెరపోయింది. అది రజిత పనే కావొచ్చని భావించి, అప్పటికప్పుడు హాస్టల్ ప్యూన్‌ని బజారుకు పంపించి - మరో గట్టి తాళం తెప్పించి వేసింది.

రజితకి నవ్వాగలేదు! జయ రూంకి వెళ్ళి జరిగిందంతా చెప్పింది.

"కొత్త తాళం తెప్పించిందా ? వెరీగుడ్ ! ఈ సారి ముహూర్తం చూసుకుని-

చేగోడీల్తో పాటు, దాన్నీ కొట్టేస్తే సరి!" అంది అరుణ.

" అలా చేస్తే - పాపం తగుల్తుంది కదే!" అంది జయ

" చాల్లే సానుభూతి ! ఆ పాప భారాన్నంతా నేనే మోస్తానుగానీ - భయపడకు!" కస్సుమంది అరుణ.

"అది అసలే తుఫాన్ ! దాన్ని రెచ్చగొడ్తే ఇంకేమన్నా వుందీ?" అంది రజిత.

"ఏయ్ ! నీ కెన్నిసార్లు చెప్పాను - నన్ను తుఫాను అనొద్దనీ !? చూడు నిమ్మీ - నేనిచ్చిన చేగోడీలన్నీ మెక్కి, నామీదికి తిరగబడ్డారు ఇద్దరి కిద్దరూ," అంది అరుణ ఏడ్పుముఖం పెడ్తూ.

"ఒకసారి నీ నిక్‌నేం నిజం చేస్తే సరి ! దరిదాపుల్లో లేకుండా కొట్టుకుపోతారు!' అంది నిర్మల నవ్వుతూ.

"హూ ః ఖర్మరా నాయనా - ఖర్మ ! ఇంకేం - నువ్వూ జతయ్యావు! ఇక మనం బాగుపడ్డట్లే ! అయినా - నేను వాగుతాననీ, దురుసుగా మాట్లాడ్తాననేగా నాకా పేరు పెట్టారు ! అయితే ఈ క్షణం నుంచి నేనిహ అస్సలు మాట్లాడనని ప్రతిజ్ఞ చేస్తున్నాను."

" నీ ముఖం! మాట్లాడకుండా ఐదు నిముషాలు కూడా వుండలేవు ! అది నీ తరంకాదు!" అంది జయ.

"ఎందుకుండలేనూ?"

"వుండలేవు!"

"వుండగలను."

"ఉండలేవు! అంతే"!

"ఉండగలనంటున్నాను!"

" అయితే అలా ఎన్ని రోజులుంటావు?"

"ఎప్పటికీ"

"పోవే,అది నీ అబ్బతరం కాదు!".

"ఎలా కాదో చూస్తాను."

సాధ్యమైనంత వరకూ సంభాషణ పొడిగించి నవ్వుతూ అంది జయ: "అమ్మాయి గారు ఓడిపోయారు."

"ఎలా ?"

" అయిదు నిమిషాలు... ఎప్పుడో అయిపోయాయి!"

"ఆః" నోరు తెరుచుకుంది అరుణ.

❁❁❁❁❁❁

ఆరోజు ఆదివారం.

"జయా. కొత్తపిల్లలందరూ నిద్రపోతున్నారే!" అంది రజిత.

“అయితే ఏంచేయమంటావ్? లేపమంటావా?”

“ మధ్యాహ్నం పూట - ఎవర్నీ నిద్రపోవద్దంటావు కదా !”

“అవునూ - అయితే ఏమిటటా ?”

“మరిప్పుడు వాళ్ళనెందుకు నిద్రపోనిస్తున్నావ్?”

“ఇది మరీ బావుంది ! వాళ్ళేమైనా నా ఫ్రెండ్సా ! నే చెప్పింది వినడానికి ?”

“ ఫ్రెండ్స్ కాకపోతే మాత్రమేం? ఒక చెడు అలవాటుని తప్పించడమన్నది మంచి పనేగా!”

“ మరేం చేయమంటావ్ ?”

“ నీ దగ్గరో ఆయుధం వుందిగా”

“ఏంటదీ ?”

కనుబొమ్మలు చూపిస్తూ మెలితిప్పింది రజిత.

“ఓహో! మీసాలా?’ అంది జయ నవ్వుతూ

“సరే పద!”

ఇద్దరూ కలిసి బ్లాక్ ఐబ్రో పెన్సిల్ తీసుకుని, దాన్ని కొబ్బరి నూనెలో ముంచి, నిద్రపోయిన వాళ్ళకల్లా మీసాలు పెట్టి, ఏమి ఎరగనివాళ్ళలా ఎవరి రూంకి వాళ్ళు వచ్చేశారు.

సీనియర్స్‌కందరికీ అలాంటివి అనుభవమే అయినా, ఆ కొత్తవాళ్ళు లేచాక, ఏమేం చేస్తారో చూడాలనుకుని - వాళ్ళు ఎప్పుడెప్పుడు లేస్తారా అని కాచుకూర్చున్నారు. రజిత రూంలోని చేగోడీల అమ్మాయిని కూడా వదల్లేదు వాళ్ళు.

“ఏయ్ నిమ్మీ లే ! పక్కరూంలో చేగోడీల అమ్మాయికి మీసాలు పెట్టాం- చూద్దుగానీ - రా!” అంటూ నిర్మలని హడావిడిగా లేపి, పక్కరూంలోకి దారి తీసింది జయ.

అప్పటికే చేగోడీ లేచి ఒళ్ళు విరుచుకుంటోంది. చేగోడీ ముఖం చూడగానే నవ్వాగలేదు నిర్మలకి. అప్పుడే నిర్మల వంక తలతిప్పిన చేగోడీ - ఎందుకో లోలోపలే నవ్వుతోంది.

“అదేమిటీ... మీ పెదవులపైన మీసాలు?” అంది నిర్మల నవ్వుతూ.

“నాకా!?” నవ్వుతూన్న చేగోడీ వెల వెలబోతూ అంది.

“అవును !”

“మరి మీక్కూడా పెట్టారే!” అంది చేగోడీ.

నవ్వుతూన్న నిర్మల ముఖం చిన్న బోయింది ! తలతిప్పి అనుమానంగా జయనీ, రజితనీ చూసింది ! వాళ్ళు నవ్వు ఆపుకోవడానికి అష్ట కష్టాలు పడ్తున్నారు !

“ఆయ్ ! ఇది నీపనా?” జయని చూస్తూ కొట్టడానికి చెయ్యెత్తింది నిర్మల చిరుకోపంతో ! ఒకటే పరుగు తీసింది జయ.

అంతే ! ఆ తర్వాత కొత్త పిల్లలెవరూ మరెప్పుడూ మధ్యాహ్నం పూట నిద్రపోవడానికి సాహసించలేదు.

❋❋❋❋❋❋

ఆ మర్నాటినుంచి ఫస్ట్‌టర్మ్ సెలవులని నోటీస్ పంపించారు.

ఒక్కరికీ ఇంటికి వెళ్ళాలన్న ధ్యాసేలేదు ! అసలు ఇన్నాళ్ళూ తమకో ఇల్లుందన్న సంగతికూడామరిచి పోయి ఆడుతూ పాడుతూ ఎంజాయ్ చేశారు.

కాలేజీ లైఫ్‌లో మధ్య మధ్య సుదీర్ఘంగా వచ్చే ఇలాంటి సెలవులను చూసి, "విద్యార్థి జీవితంలోని అమూల్యమైన ఈ కొద్ది రోజులను కూడా హాయిగా అనుభవించనీకుండా ఈ సెలవులెందుకిస్తారు?" అని విసుక్కునే విద్యార్థులు కొందరుంటే - సెలవులొస్తున్నాయంటే చాలు - పట్టరాని సంతోషంతో వారం రోజుల ముందే సామాన్లు సర్దుకునే హోమ్‌సిక్‌నెస్ విద్యార్థులు మరికొందరుంటారు! ఈ రెండో కోవకి చెందిన విద్యార్థులే కాలం గడుస్తున్న కొద్దీ, మొదటి తరగతికి చెందిన విద్యార్థుల్లో చేరిపోతుంటారు.

అదే విధంగా - అందర్తోనూ అంటీ ముట్టనట్టుగా వుండే చేగోడీ కూడా - రాను రానూ మారిపోయి - జయ బృందంలో కలసిపోయింది. ఇప్పుడు ఇంటి నుండి ఏ పిండి వంటలు వచ్చినా అందరికీ ఇస్తోంది.

తెల్లవారితే సెలవులు! మళ్ళీ ఏ పది పదిహేను రోజుల వరకో కలవం కదా అనే బెంగతో అందరూ ఒకరి అడ్రసులు మరొకరికి ఇచ్చుకుంటూ, ఈ పదిహేను రోజులు ఇంట్లో ఎంత లోన్లీగా ఫీలవుతారో చెప్పుకుంటున్నారు!

నిర్మల ఎవరి తోనూ మాట్లాడకుండా ఒక్కర్తే డాబా ఎక్కి కూర్చుని ఏదో ఆలోచిస్తోంది.

అమ్మా నాన్నా ఒక రకంగా అర్తడాక్స్ అనే చెప్పవచ్చు ! అయినా ఒక అడుగు ముందుకువేసి ఏదో ఒక సంబంధం దొరికేదాకా ఉత్తినే ఇంట్లో కూర్చోవడం దేనికి అని తనని పీయూసిలో జాయిన్ చేశారు.

అంతవరకూ అమ్మని వదిలి ఎప్పుడూ వుండలేదేమో.. ఎలాంటి రూమ్మేట్స్ దొరుకుతారో.. అసలు అమ్మని వదిలి, ఆ సంవత్సరం పాటు ఎలా వుండాలో అని భయపడ్డ తనకి - ఈ రెణ్ణెల్లూ అమ్మను కూడా గుర్తు రానీకుండా అలరించింది జయ.

అసలు ఆ మనిషే ఒక అద్భుతం! ప్రతి ఒక్కరూ ఆమె స్నేహం కోసం ప్రాకులాడే వాళ్ళే - అస్తమానం అల్లరి చేస్తూ, ఎదుటి వాళ్ళని ఏడ్పించేలా చేసే ఆ కొంటె కళ్ళూ, అమాయకంగా కనిపించే అ ముగ్ధ రూపం, తన భావాల కందనిదీ - ఏ భాష లోనూ తను వర్ణించలేని ఆ సహృదయం - అవి చాలు ఎదుటి మనుషుల్ని కట్టిపడేయడానికి.

అదేమిటో అమెని ఎప్పుడూ చూస్తూనే వుండాలనీ, అస్తమానం ఆమె తన

కళ్ళెదురుగానే ఉండాలనీ ఏమిటో వెర్రి ! ఆ వెర్రికి అంతులేదు ! ఆమె రూం విడిచి క్షణం బయటికి వెళ్ళినా, కళ్ళు గుమ్మానికే అంటుకుని ఎదురు చూస్తుంటాయి. ఇక చెవులు సరేసరి.. ఆ చెప్పుల చప్పుడుకోసం నిక్కబొడుచుకుని మరీ వింటూ వుంటాయి !

"ఏయ్ నిమ్మీ - ఎక్కడికి వెళ్ళావా అని నీ కోసం హాస్టలంతా వెదుకుతూంటే నువ్విక్కడ దాక్కున్నావా దొంగా - పద ! మీల్స్‌కి టైమైంది" అంటూ వచ్చింది జయ.

ఆ ప్రశాంతమైన వాతావరణంలో - ఏ కోతీమూకనీ వెంటేసుకోకుండా తన కోసం జయ అలా డాబా పైకి ఒక్కర్తే రావడం నిర్మల కెంతో రిలీఫ్ కల్గించింది.

తనైతే జయను ఇంతగా ఆరాధిస్తోంది గానీ - అసలు ఆమె హృదయంలో తనకో గుర్తింపంటూ వుందా అనుకుంది ఇన్నాళ్ళూ. కానీ - 'ఫర్వాలేదు, కనీసం తన యాబ్సెన్సయినా గుర్తించింది! అదే పదివేలు !" ఆ మాట అప్రయత్నాంగానే పైకి అనేసింది నిర్మల.

చలించిపోయింది జయ.

"అదేమిటి నిమ్మీ! నిన్ను నువ్వు ఎందుకలా తక్కువ చేసుకుంటావ్ ? నీకేమైందనీ? నావల్ల ఏమైనా పొరపాటు జరిగిందా? నేనెప్పుడైనా నిన్ను అలక్ష్యం చేశానా?"

" నో నో - అలాంటిదేంలేదు జయా! ఊరికేనే అన్నాను !" అంటూనే బావురు మంది నిర్మల.

జయకేమీ అర్థంకాలేదు. నిర్మల అలా అర్థాంతరంగా ఎందుకు ఏడుస్తోందో అర్థంగాక, ఎలా ఓదార్చాలో పాలు పోక, చేష్టలుడిగి అలాగే నించుండిపోయింది. మరో రెండు నిముషాల్లో కళ్ళు తుడుచుకుని నవ్వేసింది నిర్మల.

"ఎదుటివాళ్ళ హృదయంలో ఏముందో తెలియని ఈ అమాయకురాలు ఇంతమంది హృదయాలను ఎలా దోచింది?" అని అంత దుఃఖంలోనూ జయని చూస్తూ ఆశ్చర్యపోయింది నిర్మల.

(సశేషం)

**ఆంధ్రజ్యోతి వార పత్రిక 11-3-1977**